ప్రజాశక్తి

ఆదివారం 26 నవంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: జాతీయ పర్యాటక పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి జి.దాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ గ్రామీణ పర్యాటకం, గ్రామీణ ప్రాంతాలలో ఒక విభాగం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ఆయన చెప్పారు.సంబంధిత రంగాల్లో అనుభవం, ఆసక్తిగల సంస్థలు పూర్తి వివరాలకు వెబ్ సైట్ ను పరిశీలించాలని తెలిపారు. ఉత్తమ గ్రామీణ హోమ్ పోటీలను నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. సామాజిక, మౌలిక సదుపాయాల అబివృద్ధిని పెంపొందించడానికి, పర్యాటక లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్ళటంపై దృష్టి పెట్టిందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి, పర్యాటకంతో సాంస్కృతిక, సహజ వారసత్వాన్ని కాపాడటానికి నిబద్ధతతో గ్రామాలను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. ఆన్లైన్లో పూరించి సమర్పించిన దరఖాస్తులు మాత్రమే మూల్యాంకనం కోసం పరిగణించబడతాయని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తులు ఆంగ్ల భాషలో మాత్రమే ఆమోదించడం జరుగుతుందని అన్నారు.

సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా గుర్తించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ - రెండో రోజు కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలో సుదీర్ఘకాలం నుంచి మారుమూల గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా తక్షణమే మార్పు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌దేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ముందు కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల (సిహెచ్ డబ్ల్యు లు) చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, జిల్లా అధ్యక్షులు ధర్మన్నపడాల్, ఉపాధ్యక్షులు ఎల్.సుందర్రావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, ఆశా వర్కర్లతో సమానంగా పని చేస్తున్నప్పటికీ ఇచ్చే జీతం సిహెచ్‌డబ్ల్యులకు 4వేలు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఇటువంటి వ్యత్యాసం లేదని, అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 750 మంది కమ్యూనిటీ వర్కర్లకు ఈ వ్యత్యాసం ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అనేక మార్లు ప్రభుత్వ అధికారులకు, ప్రభుత్వానికి కోరినా కనీసం స్పందించలేదన్నారు. సిహెచ్‌డబ్ల్యులకు ఇచ్చే నెల జీతం 4వేలు కుటుంబ పోషణకు సరిపోలేదని, ఇచ్చే జీతం కూడా ప్రతి నెలా చెల్లించడం లేదన్నారు. ఒకవైపున ధరలు ఆకాశాన్ని అంటుతున్నా ఇచ్చే వేతనం పెంచ లేదని విమర్శించారు. యూనిఫాం, సెల్ ఫోన్లు, మెడికల్ కిట్లు ఇవ్వాలన్నారు. వీరి ఉద్యమానికి ఆదివాసి గిరిజన సంఘం అండగా నిలబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి వై.మంగమ్మ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఘం కిల్లో పార్వతమ్మ, టి మోదకొండమ్మ, జె.సావిత్రి, వి.కొండమ్మ, కే.చిన్ని, బి.లక్ష్మి, పి.కరుణావతి, పద్మ, శేషు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలదేవ్

పూర్తిగా దెబ్బతిన్న రాజ్మా చిక్కుళ్ళు

వర్షాలతో పంటలకు నష్టం

ప్రజాశక్తి -అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతంలో రాజ్మా, మినుములు, బొబ్బర్లు, కందులు వంటి పప్పు దినుసులు ఆశించినంత మేర అధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాదిలో రైతులు ఆశించినంత పంటను వేసుకోగా చేతికి అంది వచ్చే సమయంలో గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు పప్పు దినుసులతో పాటు వ్యవసాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కోత కోసి కళ్ళాల్లో నూర్పు చేసే సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చెంది తుఫాను ప్రభావంతో వర్షం వారం రోజులుగా కురిసింది. కోత కోసి ఇంటికి చేర్చే వ్యవసాయ పంట అంతా పూర్తిగా తడిసిపోయి ముద్దయ్యింది. మరి కొంతమంది రైతులు ముందే కోత కోసి ఉన్న పంట పప్పు దినుసులు పూర్తిగా తడిసిపోయి మొలకెత్తిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు సంవత్సరం అంతా కష్టపడిన కష్టం ఈ వర్షంతో పోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

20 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-పాడేరు: తమకు ఉద్యోగ భద్రత, కల్పించాలని, లేని పక్షంలో డిసెంబర్ 20 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం పాడేరులో జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.అనిల్ కుమార్ వి.జయరాజ్ మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న తమ ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం అలక్ష్యం వహించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్సి అమలు చేయకుండా నెలల తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. సీఎం ప్రకటించిన మినిమం ఆఫ్ టైం స్కేల్ పై జీవోలు ఇచ్చి అమలు చేయడం లేదని అన్నారు. త్వరలోనే ఎంటీఎస్ అమలు చేస్తామని, శాసనమండలిలో విద్యాశాఖ మంత్రి లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి మూడేళ్లయినా అమలు చేయలేదన్నారు. కేజీబీవీ టీచర్లకు మే అరకొరగా జీతాలు పెంచి చేతులు దులుపుకున్నారని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు దశలవారీగా తమ ఆందోళన కొనసాగుతుందని తదనంతరం నిరవధిక సమ్మె చేపడుతామని చెప్పారు ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఎల్ వీరభద్రమ్మ, జిల్లా ట్రెజరర్ సింహాచలం పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న ఉద్యోగులు

అవగాహన కల్పిస్తున్న వైస్ ఎంపిపి

కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో మారు మూల రంగాబయలు పంచాయతీ కేంద్రంలో వికాసిత భారత్ సంకల్పయాత్రను మండల వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి-2 శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలపై అవగాహన కల్పించేందుకే వికసిత భారత యాత్ర చేపడుతున్నామన్నారు. స్వచ్ఛమైన ఎరువులు, ఆవు పేడ, గోమూత్రలతో సేంద్రియ ఎరువులు ఎలా తయారు చేయాలో, పంట పొలాల్లో ఏ విధంగా ఉపయోగించాలో డ్రోన్ల సహాయంతో అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూమి నాణ్యత పెంచి సారవంతం మైన పంటల దిగుబడితో అధిక లాభాలు పొందవచ్చని ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వెలుగు, జిసిసి సిబ్బంది, వైసిపి నేతలు దేవా, కళ్యాణ్, లక్ష్మణ్, సీతారాం, గోపాల్, రాజు, భీమన్న, సుధారామ్ పాల్గొన్నారు.

ఇద్దరు అటవీశాఖ ఉద్యోగుల సస్పెన్షన్

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు

ప్రజాశక్తి-కొయ్యూరు

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహించిన మండలంలోని మర్రిపాకల ఫారెస్టు సెక్షన్ అధికారి ఎస్.చంద్రశేఖర్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ బీవీ రమణను సస్పెండ్ చేస్తూ చింతపల్లి డివిజన్ ఫారెస్టు అధికారి ఆదేశాలు జారీ చేసినట్లు మర్రిపాకలు ఫారెస్టు రేంజర్ వర్మ తెలిపారు. మర్రిపాకలు అటవీ రేంజ్‌లోని ఎర్రగొండ టేకు ప్లాంటేషన్లో ఇటీవల టేకు చెట్లు మాయమయ్యాయి. కొద్ది రోజుల తరువాత టేకు కలపను అక్రంగా తరలిస్తుండగా అడ్డతీగల అటవీ సిబ్బంది పట్టుకున్నారు. దీనిపై చింతపల్లి డిఎఫ్ఒ సూర్యనారాయణ, రేంజర్ వర్మ విచారణ జరిపారు. పట్టుబడిన టేకు కలప ఎర్రగొండ ప్లాంటేషన్‌కు సంబంధించినదిగా నిర్ధారించారు. టేకు ప్లాంటేషన్‌ను పరిరక్షించడంలో ఫారెస్టు సెక్షన్ అధికారి చంద్రశేఖర్, బీట్ ఆఫీసర్ బీవీ రమణ నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తించి, విషయాన్ని తీవ్రంగా పరిగణించి సస్పెండ్ చేశారు.

నేడు సివిల్స్, గ్రూప్స్ శిక్షణకు అర్హత పరీక్ష

హాల్ టికెట్లతో హాజరు కావాలి : పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలకు సంబంధించి ఐటిడిఎ ఆధ్వర్యాన 9 నెలల పాటు గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణకు ఎంపిక నిమిత్తం మొదటి లెవెల్ అర్హత పరీక్ష ఈ నెల 26న ఆదివారం రంపచోడవరంలోని ఎపిటిడబ్ల్యు బాలికల కళాశాల, ఎపిటిడబ్ల్యు బాలిక గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లతో ఉదయం 8 గంటలకు పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. మొత్తం 22 గదుల్లో ఒక్కొక్క రూమ్‌లో 20 మంది చొప్పున మొత్తం 440 మంది అభ్యర్థులకు ఓఎంఆర్ సీట్లలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఓఎంఆర్ సీట్లలో ప్రశ్నలకు జవాబు రాయడానికి పెన్సిల్, రబ్బరు తీసుకొని రావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని వెల్లడించారు.

రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకయ్య

రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రహదారి భద్రతపై మండల కేంద్రంలోని అల్లూరి జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లకు ఎస్ఐ వెంకయ్య, పోలీసులు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు, అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఓవర్ లోడు, ఓవర్ స్పీడు ఎంతో ప్రమాదకరమన్నారు. ఆటో ఓనర్లు తప్పనిసరిగా ఆటోలకు సంబంధించిన ఇన్సూరెన్స్, ఇతర రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఆటో డ్రైవర్లుకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, అతివేగంగా ఆటోలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆటో డ్రైవర్ జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. పాఠశాలలకు విద్యార్థులను తరలించే ఆటో డ్రైవర్లు సురక్షితంగా తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ జాన్ బాబు, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువపత్రాల జారీపై వాస్తవాలు నిగ్గుతేల్చాలి

ప్రజాశక్తి- చింతపల్లి: మండలంలోని నకిలీ కుల దృవపత్రాల పై తసిల్దార్ స్పందించి నిగ్గు తేల్చాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. చింతపల్లిలో శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో నకిలీ గిరిజన కుల ధ్రువపత్రాలు పొందిన వారిని విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎస్‌టి కోటాలో వారు పొందిన ప్రోత్సాహకాలు, సంక్షేమ పథకాలు తిరిగి రికవరీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజనేతరులు ఎస్టి తెగల పేరుతో నకిలీ కుల ధ్రువపత్రాలు పొంది గిరిజనులకు వస్తున్న సంక్షేమ పథకాలు అక్రమంగా పొందుతున్నారని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా కలెక్టర్ తగు ఆదేశాలు జారీ చేసి నకిలీ కుల దృవపత్రాలు ఇవ్వకుండా చేయాలన్నారు.రెండు నెలల క్రితం ప్రస్తుత చింతపల్లి తహసిల్దార్‌కు ఒక ఎస్సి కులానికి సంబంధించిన వ్యక్తి నకిలీ కుల ధ్రువపత్రాలతో సంక్షేమ పథకాలు పొందుతున్నారని, వీటిపై విచారణ జరిపి తక్షణమే తొలగించాలని కోరినా నేటికీ చర్యలు తీసుకున్న దాఖలు కనబడలేదన్నారు. చట్టాలను, హక్కులను రక్షించాల్సిన అధికారులే గిరిజనేతరులకు, అక్రమాలకు పాల్పడుతున్న వారికి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి, మండల కమిటీ సభ్యులు కిల్లో సింహాచలం, గెమ్మెలి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడల్ మాట్లాడుతూ, పాడేరు డివిజన్ పరిధిలో సుమారు లక్ష ఎకరాలకు 70 వేల మంది రైతులు కాపీ, మిరియాల సాగుపై ఆధార పడి జీవిస్తున్నారని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో కాపీ పండించే రైతులకు గిట్టుబాటు ధరలేక తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కాపీ, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. కాపీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు తక్షణమే చెల్లించి, రైతులకు పల్పర్ యంత్రాలు, నిచ్చెనలు, కట్టర్లు ఉచితంగా పంపిణి చేయాలన్నారు. రైతులకు రుణాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.గంగాధరం, కె.శరబన్న, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు ఇస్తున్న ఎస్ఐ

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సర్పంచి అర్జున్ అన్నారు. కొర్రా గ్రామంలో ఎస్సై సంతోష్ కుమార్ చేతుల గ్రామ యువతకు వాలీబాల్ కిట్లను శనివారం అందజేశారు. గిరియువత క్రీడల్లో రాణించాలనే ఆకాంక్షతో క్రీడలను పోలీసు శాఖ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఉన్నత చదువుతోపాటు క్రీడల్లో యువత రాణించి దేశానికి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఉప సర్పంచి గులాబి, వైకాపా నాయకులు బాలరాజు, గిరి యువత ఉన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

వివిధ వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏరియా ఆసుపత్రి దగ్గర కొత్తగా నిర్మిస్తున్న నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రాజెక్ట్ అధికారి శనివారం సందర్శించారు. ఆయా వ్యాధులకు సంబంధించిన మందులు రోగులకు అందజేయాలన్నారు. ఆసుపత్రికి ప్రతిరోజూ అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు ఎంతెంత మంది వస్తున్నది, ఎంతమందికి డెలివరీ చేస్తున్నదీ ఆరా తీశారు. ప్రమాదకరమైన గర్భిణులు ఆస్పత్రిలో జాయిన్ అయిన వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. జగనన్న సురక్ష కంటి వెలుగు పథకం ద్వారా లబ్ధిదారులకు ప్రాజెక్ట్ అధికారి చేతుల మీదుగా ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేశారు. అనంతరం ముసురుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా పరిశీలించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి, వైద్యాధికారులు ప్రేమ్ కుమార్, కిరణ్ దుర్గాప్రసాద్, సురేష్, కల్పన, ప్రసన్న కుమార్, ముసురుమిల్లి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఆర్‌పి కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలపై అడిగి తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

లోయలోకి కారు బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం ధర్మపురం ఘాట్ రోడ్‌లో శనివారం కారు అదుపుతప్పి లోయలోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.... జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధిలో సెల్ టవర్ల నిర్మాణానికి వచ్చిన కార్మికులు పనులు ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. దారకొండ పంచాయతీ పరిధి ధర్మపురం మీదుగా వెళ తుండగా ఘాట్ రోడ్లో కారు అదుపుతప్పి అకస్మాత్తుగా లోయ పడిపోయింది. ఈ విషయాన్ని అతి సమీపంలో కాపీ పళ్ళు ఏరుతున్న గిరిజనులు గుర్తించి వెంటనే ధారకొండ పిహెచ్సి వైద్యాధికారి హిమబిందుకు సమాచారం అందించారు. వైద్యాధికారి స్పందించి అంబులెన్స్‌ను సంఘటన ప్రదేశానికి పంపి క్షతగాత్రులను దారకొండ పిహెచ్సికి తీసుకొచ్చారు. వారికి డాక్టర్ హిమబిందు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం నిమిత్తతం చింతపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. క్షతగాత్రులు డ్రైవర్ సాల్మన్, పూరాఖాన్‌లకు శరీర లోపల భాగాల్లో గాయాలైనట్లు డాక్టర్ హిమబిందు తెలిపారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

కుటుంబ నియంత్రణపై దంపతులు అవగాహన కలిగి ఉండాలని రాజేంద్రపాలెం పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ మనోజ్ఞ సూచించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ అధిక సంతానం వల్ల మహిళలు అనారోగ్య సమస్యలకు గురవుతారన్నారని, ఈ నేపథ్యంలో కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్‌కు సంబంధించి, మగవారు ముందుకు రావాలన్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న పిహెచ్‌సి వైద్యాధికారి మనోజ్ఞ

బాల్య వివాహాలను అరికట్టాలి

కొయ్యూరు : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజేంద్రపాలెం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ఞ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపీఎం గాంధీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జెండర్ ఆధారిత హింసకు" వ్యతిరేకంగా జరిగిన జాతీయ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలపై హింసను వ్యతిరేకించాలని కోరారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో

ప్రజాశక్తి చింతూరు

చింతూరు మండలంలోని చల్లతోగు గిరిజన గ్రామంలో పోడు భూములు సాగు చేసుకున్న గిరిజనుల ఇళ్లను కాల్చివేసి, వారిపై దాడులు చేసిన ఫారెస్ట్ అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ చింతూరులో బిజెపి ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 25 ఏళ్లుగా సాగు చేస్తున్న చల్లచోగు గ్రామంలో 27 కుటుంబాల ఇళ్లను కూల్చి, కాల్చివేసిన ఫారెస్ట్ అధికారులను సస్పెండ్ చేయాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులు చొరవ తీసుకొని గిరిజనులకు పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాయం వెంకయ్య, నోముల రామారావు, రమణారెడ్డి, సవలం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

22 టేకు దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని యు.చీడిపాలెం సమీపంలో కంపమామిడి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 22 టేకు దుంగలను శుక్రవారం మర్రిపాకలు అటవీశాఖ రేంజర్ వర్మతో పాటు సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్లాంటేషన్లో ఎండిపోయిన టేకు చెట్లను నరికి కంపమామిడి గ్రామంలో దాచిపెట్టినట్టు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో రేంజర్ వర్మ, సిబ్బందితో గాలించి టేకు కలపను గుర్తించారు. అనంతరం టేకు దుంగలను మర్రిపాకలు అటవీ డిపోకు తరలించారు.

అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

వినతిపత్రాన్ని చూపుతున్న కార్మికులు

సబ్బుల పరిశ్రమను తెరిపించండి

- కలెక్టర్‌కు కార్మికుల వినతి

ప్రజాశక్తి-పాడేరు: అరకులోయలో మూతపడిన జిసిసి నిర్వహించే సబ్బుల పరిశ్రమను తెరిపించాలని సిఐటియు ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి కార్మికులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పరిశ్రమ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సింహాద్రి మాట్లాడుతూ, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిసిసి సబ్బులకు డిమాండ్ ఉన్నా మార్కెట్ చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశ్రమ తెరిపించేందుకు కృషి చేయాలని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి జిసిసి డిఎంకు తక్షణం ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరిశ్రమ తెరిపించకపోతే కార్మికులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిసిసి సబ్బుల పరిశ్రమ వర్కర్స్ యూనియన్ నాయకులు దాసు, పద్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న వైసిపి నేతలు

ఎన్నికల్లో వైసిపి విజయం ఖాయం

ప్రజాశక్తి- చింతపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులే వైసిపి విజయానికి నాంది కానున్నారని వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి అన్నారు. శుక్రవారం మండలంలోని కందులగది గ్రామంలో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ కోరాబు అనూష దేవి, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి వైకాపా జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం చిన్నగడ్డ గ్రామ సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల వివరాలతో కూడిన జాబితాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి మాట్లాడుతూ, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఎన్ని నిందారోపణలు చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటరీ వ్యవస్థను అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలు ఎవరూ మర్చిపోలేదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికలలో వైకాపాకు పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నాజర్ వల్లి, ఎంపిటిసి సభ్యురాలు దాసరి ధారలక్ష్మి (పద్మ), ఈవోపీఆర్డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు కే.శ్రీనివాస్, గ్రామ వాలంటీర్ల మండల అధ్యక్షుడు వేములపూడి పరమేశ్వరరావు, గ్రామ వాలంటీర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై నివేదిక అందించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : తిమ్మాపురంలోని కార్పొరేట్ కాలేజీ వసతి గృహంలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థి సాయిచరణ్ ఆత్మహత్యపై పోలీసులు తక్షణమే నివేదిక అందించాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు.

జిసిసి కాఫీ స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: కలెక్టరేట్ మేడపై జిసిసి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాఫీ స్టాల్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని ఒత్తిడితో సతమతమయ్యే సిబ్బందికి కాఫీ మంచి రిలీఫ్ ఇస్తుందని, ఆ సమయంలో బయటకు దూరంగా వెళ్ళకుండా అందుబాటులోనే కాఫీ లభించటంతో వారికి సమయం ఆదా అవుతుందన్నారు. జిసిసి ఉత్పత్తులు కూడా అందుబాటు ధరలో ఈ స్టాల్‌లో లభిస్తున్నందున ప్రత్యేకంగా మార్కెట్‌కు వెళ్ళాల్సిన అవసరం లేకుండా కార్యాలయం నుండి ఇంటికి వెళ్ళే సమయంలో తీసుకోవటంతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.ఈ సందర్భ ంగా జిసిసి ఉత్పత్తులపై ఆరా తీసిన కలెక్టర్... రైతులు తమ కాఫీ పంటను జిసిసికి అమ్మడంతో లబ్ది పొందాలని విజ్ఞప్తి చేసారు. మధ్య దళారులను నమ్మి మోష పోవద్దని, ఐటిడిఎ ఆధ్వర్యంలో జిసిసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. కాఫీ కొనుగోలుకు రైతులకు అవసరమైన ఫోన్ నంబర్లను చేయాలని జిసిసి ఎండి సింహాచలంను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, కేఆర్‌ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.మురళీకృష్ణ, రెవెన్యూ అసోషియేసన్ ప్రతినిధి తహసిల్దార్ చిన్ని కృష్ణ, ఎపిఎంఐపి పిడి రహీం, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్యాం కుమార్, జిసిసి ఎండి సింహాచలం, ఆదివాసి జేఏసి ప్రతినిధి రామారావు దొర, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

సంతల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో అల్లూరి జిల్లా తూనికల కొలతల అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వారపు సంతలో కమీషన్ ,ఏజెంట్లను వ్యాపారస్తులకు ఐదు కేసులు నమోదు చేశామని వారు అన్నారు , క్షుణ్ణంగా వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వస్తువులను బరువును సరిగ్గా చూసుకొని తీసుకుని వెళ్లాలని వారు తెలిపారు ,రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన పంట దినుసులను కాటాలో తూనికలు చేసినప్పుడు ప్రమాణాలు పాటించి సరైన పద్ధతిలో తూనికాలు చేయించుకోవాలని రైతులకు సూచించారు. మోసాలు చేసినట్లయితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని వారు అన్నారు. అలాగే డిజిటల్ కాటాలలో తేడాలు గమనించి ఐదుగురిపై కేసులు నమోదు చేసి మరొకసారి తనిఖీలు నిర్వహించేటప్పుడు తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధించిన అధికారులు వ్యాపారస్తులను సూచించారు. ఈ తనిఖీలలో విశాఖ జిల్లా సహాయ నియంత్రకులు పి అప్పలరాజు, ఇన్స్పెక్టర్ భాస్కరరావు, తూనికల కొలత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు చేపడుతున్న అధికారులు

వైసిపి నేతలు ఆత్మీయ కలయిక

ఆత్మీయ కలయికలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని పాడేరు మండలం సూకురు పుట్టు గ్రామంలో శనివారం వైయస్సార్సీపి శ్రేణుల 'ఆత్మీయ కలయిక' కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లి బాబు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలోని వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలను ఆహ్వానించారు. దీంతో ఈ కార్యక్రమానికి పాడేరు నియోజకవర్గ స్థాయి లో 5 మండలాలకు చెందిన సుమారు 200 మంది ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5 మండలాల ముఖ్య నాయకులు వచ్చే అసెంబ్లీ ఎన్నికల పై తమ మనోగతాన్ని అభిప్రాయాలను వ్యక్తపరిచారు. పాడేరు నియోజకవర్గం లో కార్యకర్త స్థాయి నుండి ఎదిగిన శతక బుల్లి బాబుకు అధిష్టానం గుర్తించి ఎమ్మెల్యే సీటు కేటాయించాలని ముక్త కంఠంతో నినదించారు. అనంతరం విచ్చేసిన నాయకులందరికీ చైర్మన్ బుల్లిబాబు సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఎస్.టి.సెల్ జోనల్ ఇంచార్జి కిముడు.విశ్వ మాజీ మండల అధ్యక్షులు కూడా సింహాచలం పాల్గొన్నారు.

అర్హులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: అర్హులైన ప్రతి ఒక్క గిరిజ నులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని కొర్రాయి పంచాయతీ సర్పంచ్ పి.కొములు చెప్పారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా శనివారం కొర్రాయి పంచాయతీ పెద్ద అంజోడ గ్రామంలో హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్లు మంజూరుకు అర్హులైన గిరిజనులతో ఆన్లైన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన గిరిజనులకు ఉచిత గ్యాస్ పథకాలు అందలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అరకు పంచాయతీ సర్పంచ్ జి శారద, ఉప సర్పంచ్ వి.జగన్నాథం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

అన్ని వర్గాల అభ్యున్నతే టిడిపి లక్ష్యం

-మాజీ మంత్రి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి ఉంటుందని మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం కించుమండ పంచాయతీ టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు ఆధ్వర్యాన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ గ్రామ గిరిజన మహిళలు పూలదండలు వేసి ఘన స్వాగతాన్ని పలికారు. అనంతరం ఇంటింటికెళ్లి మినీ మేనిఫెస్టోపై ప్రచారం చేశారు. తెదేపా హయంలో గ్రామాల్లో సురక్షిత తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి రోడ్లు కల్పించామన్నారు. నాలుగున్నర ఏళ్ల వైకాపా పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాగేశ్వరరావు, స్వామి పాల్గొన్నారు.

గీతంలో అధునాతన సిటి స్కాన్ ఏర్పాటు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య కళాశాల ఆసుపత్రిలో రోగుల వైద్య పరీక్షలకు అధునాతన సిటీ స్కాన్ పరికరాన్ని (సోమాటమ్ గో) శనివారం గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం ప్రారంభించారు. జిమ్‌సర్ ఆసుపత్రిలోని రేడియేషన్ విభాగంలో ఏర్పాటైన ఈ పరికరం సిటి స్కాన్ వైద్య పరీక్షల సయయంలో రోగులపై రేడియేషన్ ప్రభావాన్ని తగ్గించడంతో పాటు రోగ నిర్ధారణలో ఖచ్చితమైన సమాచారం నమోదు చేయగలదని విభాగాధిపతి, ప్రముఖ రేడియాలజీ నిపుణులు డాక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. రేడియేషన్ పరీక్షలలో వేగంతో పాటు వైద్యులకు ఖచ్చితమైన వివరాలను అందించగలగటం ఈ సిటీ స్కాన్ ప్రత్యేకత అన్నారు. వైద్య రంగంలో ఈ సిటీ స్కాన్ సరికొత్త ఆవిష్కరణగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ పరికరం హృద్రోగ పరీక్షలలో, రోగ నిర్ధారణ, వైద్యులు తదుపరి నిర్ణయాలు తీసుకోవడంలో ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని చెప్పారు. జిమ్‌సర్ ఆసుపత్రి ద్వారా నగర ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందిచడానికి ఈ సరికొత్త సిటీ స్కాన్ దోహద పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, సూపరింటెండెంట్ డాక్టర్ వివిఎల్.నరసింహరావు, జిమ్‌సర్ ఆపరేషన్ హెడ్ డాక్టర్ బి.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రతిపాదనను విరమించాలి

ప్రజాశక్తి -మధురవాడ : పిఎసిఎస్ సభ్యులు ఏకగ్రీవంగా వ్యతిరేకించినా పెట్రోల్, డీజిల్ బంక్ పెట్టాలన్న సహకార శాఖ అధికారుల ప్రతిపాదనను తక్షణమే విరమించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించిందని పిఎసిఎస్ పూర్వ ఉపాధ్యక్షులు ఎం.పైడిరాజు తెలిపారు. సంఘం ఆవరణలో సభ్యులు సియ్యాద్రి పైడితల్లి, పోతిన ఎల్లమనాయుడుతో కలిసి శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పైడిరాజు మాట్లాడారు. మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి (పిఎసిఎస్) సర్వే నెం 159/5 బిపిలో ఉన్న 0.48 సెంట్ల సొంత స్థలంలో ఉన్న భవన సముదాయాన్ని కూల్చివేసి పెట్రోల్, డీజిల్ బంక్ పెడతామని సెప్టెంబరు 21న సభ్యులకు తెలియకుండా అధికారులు కొలతలు కొలిచారని తెలిపారు. దీనిపై వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి సంఘం సభ్యులు, అఖిలపక్ష నాయకులు తీసుకెళ్లారని వివరించారు. ఎమ్మెల్యే స్పందించి డిప్యూటీ రిజిస్ట్రార్‌తో మాట్లాడి తనకు తెలియకుండా ఇటువంటి అనాలోచిత నిర్ణయాలు చెయ్యవద్దని చెప్పారని తెలిపారు. అయినా అధికారులు బంక్ కోసం డిపాజిట్ కట్టారని వివరించారు. దీంతో తప్పనిసరి అయి సంఘం సభ్యులమైన నలుగురుము కలిసి హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు సంఘం సభ్యులకు ఇష్టం లేకుండా ఇటువంటి ప్రయత్నాలు చెయ్యడం సహకారం శాఖ నిబంధనలకు వ్యతిరేకమని హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత తీర్పునిచ్చారని తెలిపారు.

అనకాపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు పావని

ప్రజాశక్తి - అనకాపల్లి : ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.పావని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సంఘం ఆధ్వర్యాన స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఎన్‌టిఆర్ స్టేడియం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఇపిని రద్దు చేయాలని, అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పెద్ద పెట్టున నినదించారు. అనంతరం సంఘం జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పావని మాట్లాడుతూ నూతన విద్యా విధానం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల భారం పడుతుందని, డిగ్రీ సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని అన్నారు. మహిళలు, విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులు, దాడులు పెరుగుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించడం సరికాదన్నారు. మహిళల రక్షణకు చట్టాలు ఉన్నా వాటిని పటిష్టంగా అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని మండిపడ్డారు. సంఘం పూర్వ జిల్లా నాయకులు శంకరరావు మాట్లాడుతూ పాఠశాలల విలీన పద్ధతిని దేశంలో ఎక్కడా అమలు చేయకుండా మన రాష్ట్రంలోనే అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఇది విద్యార్థులను చదువుకు దూరం చేయడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, జిల్లా ఉపాధ్యక్షులు గీతాకృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్.శివాజీ, బాలాజీ, రామేశ్వరరావు, ప్రసాద్, కార్తీక్, కేశవ, వెంకటేష్, బంగారు చిట్టి, అభి, వెంకటి, రమ్య, పూజిత, స్వరూప పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనలకు ఉచిత స్థలం ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పుస్తక ప్రదర్శనలకు ప్రభుత్వం ఉచితంగా స్థలాలు ఇవ్వాలని ప్రముఖ రచయిత డివి.సూర్యారావు అన్నారు. విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాన్ని శనివారం విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ సిహెచ్.రాఘవేంద్రరావు ప్రారంభించారు. అనంతరం ఆచార్య సూర్యారావు మాట్లాడుతూ సమాజంలో రచయితల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. విద్యార్థులలో పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించడం కోసం తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడిని తీసుకొచ్చేందుకు విశాలాంధ్ర ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. ఠాగూర్, ప్రేమ్‌చంద్ తదితర ప్రముఖుల సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు విశాలాంధ్ర ప్రచురణలు పరిచయం చేశాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, ఆచార్య సిమ్మన్న, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, బుక్‌హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపులో జగనే సూత్రధారి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఓట్లను తొలగించడం, దొంగ ఓట్లు నమోదు జరిగేలా చూడటం వంటి చర్యల్లో ప్రధాన సూత్రధారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డినే అని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ఆరోపించారు. శనివారం నగరంలోని ఓ హోటల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో టిడిపి, జనసేన కూటమి అఖండ విజయం సాధిస్తుందన్నారు. జగన్‌కు ఎన్నికలలో ఓడిపోతాననే భయం పట్టుకుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఎవరైతే పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారో వారిని వాలంటీర్ల సాయంతో గుర్తించి ఓట్లను తొలగించారన్నారు.

నయవంచన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖలో మంత్రులు, విభాగాల అధిపతులు, ఉన్నతాధికారులకు క్యాంపు కార్యాల యాలను కేటాయిస్తూ తాజాగా ప్రభుత్వం జారీచేసిన జిఒను చూస్తే 'తాటి చెట్టు ఎందుకు ఎక్కావంటే, దూడ గడ్డి కోసమన్నట్లు' వుంది. రాజధాని విషయం న్యాయస్థానంలో వుండడంతో రాజధానిని తరలిస్తున్నామని చెప్పే సాహసం చేయలేక ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పర్యవేక్షణ, సమీక్ష ముసుగులో ప్రభుత్వ కార్యాలయాలను తరలించి తన పంతం నెగ్గించుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లు అర్థమవుతుంది. 35 శాఖల్లో 18 శాఖలకు భవనాలు గుర్తించినట్లు ఉత్తర్వులో పేర్కొంది. కానీ ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డికి మాత్రం కార్యాలయం కేటాయించలేదు. రుషికొండలో రిసార్టుల పేరిట పర్యాటక శాఖ నిర్మిస్తున్న భవనం నుంచి సిఎం పరిపాలన వుంటుందన్న ప్రచారం వాస్తవరూపందాల్చేందుకు కొన్ని రోజులు పట్టేలా వుంది. అనుకున్నట్లు భవనానికి హంగులన్నీ అయ్యాక సిఎం క్యాంపు కార్యాలయ కేటాయింపు కూడా పూర్తికానుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధివున్నా, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించివుండేది. దాదాపు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వానికి అభివృద్ధి పట్టలేదు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల కేటాయింపుతోనే అభివృద్ధిని పరుగులు తీస్తుందని నమ్మించాలని చూస్తోంది.

కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాల్లో ఉత్తరాంధ్రకు జరిగిన అన్యాయమే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. వెన్నుముకలేనట్లు ప్రజాప్రతినిధులు వ్యవహరించబట్టే వెనుకబాటుతనం నుంచి బయటపడ్డంలేదు. నేటి తరం ఆశలు, ఆకాంక్షలు పాలకపక్షానికి పట్టడంలేదు. విలువలు వదిలి, అబద్ధాలాడి, అభివృద్ధి లక్ష్యాలు మరిచి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రవరిస్తున్నాయి. ఆత్మను అమ్ముకొని, ఆత్మాభిమానాన్ని చంపుకొని చేస్తున్న రాజకీయాలు ఎవరి కోసం? స్వీయ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు ఇందులో ఏమున్నాయి.

32 మంది ప్రాణాలు బలిదానం చేసి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలో బిజెపి నాయకత్వాన వున్న మోడీ ప్రభుత్వం నిలువునా అమ్మకానికి పెడుతుంటే వైసిపి, టిడిపి, జనసేన ఏమిచేస్తున్నట్లు ?. ఫ్యాక్టరీ అమ్మకాన్ని అడ్డుకోలేని ఈ ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసమే ఈ కార్యాలయాల తరలింపు అంటే ముమ్మాటికే వంచనే. సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునీకరించి పునరుద్ధరించకుండా, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తిచేయకుండా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు కేటాయించకుండా ఈ ప్రాంతం వ్యవసాయంలో ఎలా పురోగతి సాధిస్తుందని ఈ ప్రభుత్వం భావిస్తోంది?. గిరిజన ప్రాంతంలో రహదారుల సౌకర్యం కల్పించకుండా డోలీ మోతలు ఎలా తప్పుతాయి?. వైద్య సౌకర్యం ఎలా అందుబాటులోకి వస్తుంది?. ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణకు సిపిఎం ఉత్తరాంధ్రలో ఇటీవల బైక్ ర్యాలీ చేపట్టి ప్రజలను కదిలించింది. తమ బలం పెరిగిందని చెప్పుకొనే ప్రధాన పార్టీలు బిజెపి ప్రమాదకర విధానాలపై మాట్లాడ్డానికి ఎందుకింత బలహీనంగా వున్నాయి?. ప్రభుత్వం తమ పంతం నెగ్గించుకున్నామన్న ఆనందంలో అభివృద్ధిని విస్మరించి రాజకీయ విన్యాసాలు చేస్తే ప్రజలు సహించరన్న సత్యాన్ని తెలుసుకోవాలి. ప్రజల కోపం కట్టలు తెంచుకొనే రోజులురాకముందే వంచనను వదలి, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి.

మిలీనియం టవర్‌లో..

ఐటి సంస్థలకు ఆస్కారం లేనట్టే !

ఒక్కొక్కదాన్నీ శాఖల కోసం ఆక్రమిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని రుషికొండ హిల్ నెంబర్ 3 మిలీనియం టవర్‌లో స్థానిక ఐటి సంస్థలకు ఆస్కారం లేకుండా పోతోంది. ఐటి కంపెనీలకు తక్కువ అద్దెలకు ఇక్కడి భవనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం తొలుత దీని నిర్మాణం చేపట్టింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖకు కీలక ప్రభుత్వ శాఖలను తరలించి మిలీనియం టవర్ మొత్తాన్ని ఆక్రమించుకుంటోంది. మిలీనియం టవర్ 'ఎ'ను రూ.145 కోట్లతో ఎపి ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అభివృద్ధి చేసింది. మొత్తంగా ఈ ఫ్లోర్ ఏరియా 170000 చదరపు అడుగులు. 2019 ఫిబ్రవరి 15న ప్రారంభించారు. హిల్ నెంబర్ 3పై ఎ, బి బ్లాక్‌లు ఉన్నాయి. ఈ రెండింటిలో కలిపి సుమారు 4 లక్షల చదరపు అడుగుల స్థలం ఉంది. రాజధాని విశాఖకు వచ్చిన సందర్భంగా తాత్కాలిక సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు ఇక్కడ ఉండనున్నాయి. ఇక్కడి మిలీనియం టవర్ బిను రాష్ట్ర ప్రభుత్వం రూ.19.73 కోట్లతో పూర్తిచేసింది. అంతకు ముందే ఎ బ్లాక్‌ను 10 అంతస్తులుగా తీర్చిదిద్దారు. తాజా నిర్ణయాలతో మిలీనియం టవర్ ఎ, బి బ్లాక్‌లు ప్రభుత్వ ఆధీనంలోకి రానున్నాయి. ఇదే ప్రాంగణంలో కాండ్యుయెంట్ అంతర్జాతీయ ఐటి దిగ్గజ సంస్థ పక్కనే ఉండనుంది. గతంలో ఈ సంస్థకు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయాలని కోరినా మొండికేయడంతో తాజాగా ఆ కంపెనీ జోలికి ప్రభుత్వం వెళ్లలేదు. ప్రస్తుతానికి ఖాళీ ప్రాంగణంలోకి మాత్రమే ప్రభుత్వ శాఖల తరలింపు జరుగుతోంది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల బృందం కూడా రుషికొండ హిల్ నెంబర్ 3పైగల మిలీనియం టవర్ ఎ, బి బ్లాక్‌లను పలు దఫాలుగా పరిశీలించిన పిదపే ఆమోదముద్ర వేసింది.

అసలు సమస్యేమిటి?

పెద్ద పెద్ద ఐటి దిగ్గజ సంస్థలేవీ విశాఖకు రానందున స్థానికంగా యువతకు ఉపాధి కల్పించడానికి బిపిఒ కంపెనీల కోసం మిలీనియం టవర్ నిర్మించారు. రెంటల్ ఛార్జీలు కూడా మినిమంగా నిర్ణయిస్తే తప్ప చిన్న సంస్థలూ ఇక్కడికి రాని పరిస్థితి ఉంది. వీటికోసం నాలుగు అంతస్తులను ఖాళీగా ఉంచుతున్నారు. ఐతే అసలు సమస్యేమిటిటంటే పక్కనే హిల్ నెంబర్ 1, 2 కొండలపై అంటే ఇన్ఫోసిస్, టెక్‌మౌరి ఐటి సంస్థల వద్ద హెలీప్యాడ్ నిర్మాణం జరిగింది.

దీని వల్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖకు వచ్చి పోయేటప్పుడు మొత్తంగా ఐటి ఉద్యోగులకు ఇక్కట్లు తప్పవని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ హెలీప్యాడ్ నుంచే రుషికొండలోగల ఎపి టూరిజం స్థలాల్లో నిర్మాణమైన సిఎం క్యాంప్ ఆఫీసుకు జగన్ వెళ్లాలి. ఆయన వచ్చినప్పుడు, వెళ్లినప్పుడు గంటల తరబడి ఐటి ఉద్యోగులు సెక్యూరిటీ సమస్యలను ఎదుర్కొనాల్సిందేనా ? అనే ప్రశ్నకు ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం వద్ద సమాధానం లేదు. అంతేగాక పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ శాఖలు కొన్నింటికి అకామిడేషన్ సదుపాయం లేనందున నిర్మాణంలో ఉండే భవంతులను హోల్‌సేల్‌గా రెంటల్స్‌కి తీసుకోవడం కూడా జరుగనుంది.

'ఉక్కు' పరిరక్షణతో రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుని ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1017వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఎండి, అడ్మిన్, యుటిలిటీస్, టౌన్ అడ్మిన్, టిటిఐ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.5 వేల కోట్లు పెట్టుబడి పెడితే పన్నుల రూపేణా ప్లాంట్ రూ.25 వేల కోట్లును రాష్ట్రానికి, రూ.50 వేల కోట్లును కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లించిందన్నారు. ప్రస్తుతం మూడు లక్షల కోట్లకుపైగా ఆస్తులను కలిగి ఉందని తెలిపారు. నేటి పాలకులు వెయ్యి జన్మలెత్తినా విశాఖ ఉక్కు లాంటి భారీ పరిశ్రమను నిర్మించగలరా ? అని ప్రశ్నించారు. పోరాటాలతో, త్యాగాలతో ఏర్పడ్డ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ కదన రంగంలోకి దిగాలన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు ఎన్.రామచంద్రరావు, కామేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

27న మదర్స్ కమిటీకి శిక్షణ

ప్రజాశక్తి-కొయ్యూరు : ఈ నెల 27న సోమవారం కొయ్యూరు మండలంలోని పాఠశాల మదర్స్ సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు అంగన్వాడీ నోడల్ అధికారి విజయకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే చింతపల్లి, జీకే వీధి, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, అరకు, అనంతగిరి మండలాల్లో శిక్షణ పూర్తయినట్లు వెల్లడించారు. నాడు-నేడు ఫేస్ 2బిలో భాగంగా ప్రతి మండలంలో సొంత భవనాల మరమ్మతుల పనులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చింతలపూడిలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు రామ్మూర్తి, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు సన్యాసిరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. 89, 90 బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి కొయ్యూరు : కొయ్యూరు మండలం డౌనూరు ఆశ్రమ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పొటుకూరి సాయిసంతోష్ అనే బాలుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బూసులకోట గ్రామానికి చెందిన సాయిసంతోష్, ఇంటి నుంచి పాఠశాలకు ఆటోలో వెళుతున్న క్రమంలో బోడకొండమ్మ ఘాట్లో ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సంతోష్‌ను కుటుంబీకులు వెంటనే విశాఖలోని ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-మారేడుమిల్లి : విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై మారేడుమిల్లి గ్రామ సచివాలయం వద్ద అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.వీర కిషోర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వీడియో రూపంలో ప్రదర్శించి లబ్ధిదారులకు చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండా జాకబ్, జడ్పిటిసి గొర్లె బాలాజీ బాబు, ఎంపీపీ సార్ల లలిత కుమారి, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, పంచాయతీ సెక్రటరీ పి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి కుటుంబాలు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ఫోక్స్‌పేట పంచాయితీ పరిధిలోని వైసిపికి చెందిన నాలుగు కుటుంబాలను టిడిపిలో చేరారు. వారికి టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు ఆధ్వర్యాన శనివారం మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఫోక్స్‌పేట రామాలయం వీధిలో బాబు షూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంటపాటి అనంత మోహన్, కారం సింహాచలం, బాపన్న దొర, మడకం పండు దొర,బూత్ ఇంఛార్జి కోసు నాగన్న దొర, కారం రాజ గోపాల్, మడకం బొజ్జిదొర, కారం చిన పోతురాజు, కారం యేసు దొర, బెలం కొండయ్య,సారాపు జోగి దొర,కారం అబ్బాయ్ దొర తదితరులు పాల్గొన్నారు.